
# రామారావు చతుర్శ్లోకాలు

## మధురాంతకం రాజారాం

సమయం రాత్రి తొమ్మిదిగంటలు. నాలుగంకణాల పూరింట్లో చీకటిలో తెల్లబోతున్న గుడ్డి దీపంఎదుట కూర్చుని అర మోడ్పు కళ్ళతో ఆలోచిస్తున్నాడు రామారావు. అప్పుడే యిల్లంతా మాటు మణిగింది. ఇక కుర్రాడు నిద్ర పోవడ మొకటే తరువాయి. రామారావు భార్య శకుంతల ఉవాచ ప్రకారం ఈ కుర్రకుంక పోయిన జన్మలో ఖజానాకు కావలి గాచిన వాడు! దీపకాంతి వాడిపైకి ప్రసరించ గూడదు. రెండు - ఇంట్లో చీమ చిటుక్కు మనగూడదు. మూడు- ఊయల్లో వేసిన తరువాత నాలు గైదు గడియల సేపు నిర్విరామంగా వూపుతూ వుండాలి.



శకుంతల యిప్పుడు చేస్తున్న పనే అది! ఒక వైపున కను రెప్పలపైన బరువుగా కూర్చున్న నిద్ర, మరొక వైపున ఎప్పుడెప్పుడు మేను వాలుద్దాం అన్న బడలిక. నిలువునా నిల్చోలేక నూట ఇరవై డిగ్రీలకు వంగిపోయి వూయలతోసాము చేస్తోంది శకుంతల!

జరుగుతున్నది చలికాలం. ఎండా కాలమైతే ఎంతకూ చీకటి పడని సాయంకాలాల్లో ఏటి నడుమ నల్లటి బండపైన కూచొని ఆలోచించు కోడానికి వీలుండేది రామారావుకు! పాడు శిశిరంలో ప్రొద్దు యిట్టే పుట్టి అట్టే మాయమై పోతుంది. ఇక నిశా కాంతను కౌగలించుకో కోసరడంకన్నా గత్యంతర మేముంది?

రామారావుకు వ్రాయడమే ఉద్యోగం కాదు. భుక్తికోసం అతడు వేరే ఉద్యోగం చేస్తున్నాడు. నిష్కర్షగా చెప్పడానికి వీల్లేదుగానీ నెలరోజుల్లో ఏదోఒకరోజున అతడిచేతికి రూపాయలు తొంభైనాలుగు ముడుతున్నాయి. ఈ ఆర్జనతో ఆరుగురు పెద్దవారు, ఓ కుర్రవాడూ వున్న సంసారాన్ని అతడు ఎలా ఎలా ఈదుతున్నాడన్నది మరెప్పుడైనా వ్రాయవలసిన కథ, రామారావు యిప్పుడు వ్రాయదలచుకొంటున్నది ఆ కథ గాదు.

వెండి చంచాను నోటిలో వుంచుకొని పుట్టిన వాడు కాదు రామారావు. ఆ విధంగా పుట్టని అసంఖ్యాక దీన మానవానీకంలో రామారావు ఒక్కడు. ఎడమవైపునగాని కుడివైపునగాని అతడి పేరుకు అతికింపులు లేవు. అందమగు చోట సర్వమూ అందమే నంటాడు కవి కుల గురువు! ఆ అందంలేని చోట అదిలేని లోపాన్ని మరుగు పరచడానికి మరేదైనా అవసరం. నల్లటి కోయిలకు తీయటి గొంతుక భగవంతుడిచ్చిన వరం. వేరొక విధంగా ఆ మాట తనకు సైతం వర్తించక పోదని ఎవరైనా చెబితే అందుకు అభ్యంతరం చెప్పగలిగే అహంభావం రామారావులో లేదు.

ఏవో నాలుగు ముక్కలు వ్రాయాలేగాని, వ్రాసిన తరువాత "బాగా రాస్తున్నావోయ్" అంటూ వీపు చరచి ప్రోత్సాహ మిచ్చేపాటి సహృదయత లోకంలో లేక పోలేదు. ఆ మాట విన్నప్పుడెల్లా ఎదుటి వ్యక్తికేసి చూస్తూ తెల్ల బోతుంటాడు రామారావు. అంతకన్నా తాను చేయగలిగిందేముంది!... తాను చేస్తున్న పని మూలంగా లోకానికి ఉద్ధరింపు కలుగుతుందన్న అత్యాశ రామారావుకులేదు. అలాంటి తలపోత తన కోడి, తన కుంపటి లేకపోతే తెల్లవారదనుకున్న ముసలావిడ ఊహలా అపహాస్యం పాలుకాగలదని రామారావుకు తెలుసు. జీవనయాత్రాపథంలో మనకు తగిలిన బాధలను, హృదయాన్ని తాకిన ఆవేదనను వ్రాతలో బహిర్గతంచేసి ఆ రీతిగా ఆలోచనల బరువు నుంచి విముక్తి పొంద గలిగితే, కాస్త తేలిగ్గా వూపిరి పీల్చుకుంటూ బ్రతక డానికి వీలుంటుందని రామారావు నమ్మకం.

ఒక విధంగా రామారావు అదృష్టవంతుడు. అతడి వ్యాసంగానికి అవసరమైన ముడి సరుకును భగవంతుడు అతడి చుట్టు ప్రక్కల్నే ప్రోదిచేసి పెట్టాడు. కంటికి కనిపించిన వ్యక్తితోని వైచిత్రి, చెవిదాకా వచ్చిన వార్తలోని నిజం. నేపథ్యసంగీతంలా కొంత వాతావరణం, ఒక్కింత అనుభవం, ఇంచుక కల్పన- ఈ సరంజామాతో సంవత్సరాల-పర్యంతంగా తన వ్యాసంగం కొనసాగించుక పోతున్న రామారావు హృదయం లోలోతుల్లో ఒక్క కోరిక మాత్రం -దీపం క్రింద నీడలా-తీరకనే వుండి పోయింది.

ఇన్నాళ్ళకు ఆకోరిక కొకరూపం యివ్వగలిగే సావకాశం సమకూరినట్టు తోచింది రామారావుకు. పది పదిహేను నిమిషాల నుంచి అతడు కృత్యాద్యవస్థలో కొట్టు మిట్టాడు తున్నాడు.

• • •

చిమ్మ చీకటిలో మినుకు మినుకు మంటున్న గుడ్డి దీపానికిమల్లే, యింట్లో తావులేక పొరిగింట్లో పడుకున్న రామారావు పెదతల్లి నీరవ నిశ్శబ్దాన్ని చీల్చుకొని దగ్గుతోంది.

ఆ దగ్గువల్ల రామారావుకు హఠాత్తుగా ఓ విషయం స్ఫురించింది. తన కథను ప్రారంభించ డానికి ముందుగా తాను పెద్దమ్మను గురించి చెప్పుకోక తప్పదు.

పెద్దమ్మ వయసు ఆరో పది దాటింది. బహుశా ఆమె పంతొమ్మిదో శతాబ్దం ఆఖరి దశాబ్దంలో పుట్టి వుంటుంది. ప్రథమ ప్రపంచ మహా సంగ్రామం జరిగిన రోజుల్లో ఆ యింటికి వచ్చి వుంటుంది. ఆమె కాపురానికి రాగానే అన్నదమ్ములు వేరు వేరు కుండల్లో వంటలు ప్రారంభించడం, కాపురాలు విచ్ఛిన్నం కావడం, ఆ యింటిమీది కాకి ఈ యింటిపైన వ్రాలక పోవడం, మొదలైన సంఘటనలు జరిగాయి. ఈ సంఘటన లన్నింటిలోనూ పెద్దమ్మ పాత్ర చాలా వుంది. వాడగా వాడగా పదునెక్కే ఆయుధాన్ని గురించి వ్రాస్తూ వాషింగ్టన్ యిర్వింగ్ ఆడవారి నాలుకను గురించి ప్రస్తావించాడు. పెద్దమ్మ మాటలు విన్నప్పుడల్లా రామారావుకు ఆ ప్రస్తావన జ్ఞప్తికి వస్తుంది. ఇప్పుడు కాదుగానీ ఆ రోజుల్లో పెద్దమ్మ మాటకు యింట్లో తిరుగుతుండేది కాదేమో! ఆ పూర్వ కాలపు ఔన్నత్యాన్ని నెమరుకు తెచ్చుకుంటూ 'కట్టుకున్నాయనగూడా నా మాటకు లోబడే వర్తించారు గదమ్మా' అని అదో పెద్ద మెరిట్ సర్టిఫికెట్టులా యిప్పటికీ బాహాటంగా చెప్పుకుంటూ వుంటుంది పెద్దమ్మ.

స్వాభిమానం ఏమనిషిలోనైతే దురభిమానంగా మారుతుందో ఆమనిషికీ పరిసరాలకూ ఎడతెగని సంఘర్షణ జరుగుతూనే వుంటుంది. ఏదో అపచారం జరిగిపోతున్నట్టుగా బాధపడడం, ఎదుటి వాళ్ళని బాధించడం అలాంటి వాళ్ళ స్వభావమైపోతుంది. అందుకు ప్రత్యక్ష నిదర్శనం రామారావు పెద్దమ్మ.

ఒకానొక పాత్రకు ఏవో కొన్ని గుణాలను సంక్రమింప జేసి, అందని, అదకనీ పరిస్థితుల్లో ప్రవేశపెట్టి తమాషాను తిలకించడం జగన్నాటక సూత్రధారి, లీలా వినోదాల్లో ఒకటైతే కావచ్చు! ఆయన రామారావు పెద్దమ్మకు బిడ్డలు లేకుండా చేశారు.

సంఘంలో అందులోనూ ప్రతి వారికీ ఎదుటవారి గొడవలే కావల్సివచ్చే పల్లెటూళ్లో అనపత్యురాలి బ్రతుకు ఎన్నెన్ని విధాల హీనంగా పరిణమిస్తుందన్నది భావుకులు తీరిగ్గా ఆలోచించుకోదగిన విషయం! ఇంటి చుట్టు జ్ఞాతులున్నారు. వాళ్ళయిళ్ళల్లో పనస పళ్ళ లాంటి బిడ్డలున్నారు. గొడ్రాలికంట బడితే ఎక్కడ దిష్టిదోషం తగులు తుందోనని వాళ్ళు తమబిడ్డల్ని చీరచెరగుల్లో దాచుకుంటారు!

ఎక్కని కొండలులేవు. చూడని దేవుళ్ళు లేరు. చేయని నోములులేవు. కానీ ఆశవదలి పెట్టడం కొందరి స్వభావం కాదు. ఆమె

ఆలోచించింది. ఉపాయాంతరాలు లేనేలేవా? లేకేం, భర్తకు పునర్వివాహం చేస్తే!

ఆ శుభ కార్యంకూడా నెరవేర్చింది. భగవంతుడు యింకా ఆమెను పరిశోధించా లను కోలేదు. ద్వితీయ కళత్రానికి సంతానం కలిగింది. రామారావు, అతడి తర్వాత ముగ్గురు ఆడబిడ్డలు భూమిపైకి వచ్చారు.

బిడ్డల పెంపకంలో గూడా రామారావు పెద్దమ్మ ఓ విచిత్రమైన పద్ధతినే అవలంబించింది. ఆమె బిడ్డల పెంపకాన్ని సర్వహక్కులతో తన స్వంతంచేసుకుంది. వాళ్ళ తెలివి వాళ్ళకు వచ్చేదాకా పిల్లలకు తల్లిని ఒక పరిచారిక హోదాలో మాత్రమే తెలుసు. ఆమె ప్రభావం పిల్లలపైన అంతగా ప్రసరించింది.

ఇదంతా అలనాటిగాథ! రామారావుకు, అతడిచెల్లెళ్ళలో యిద్దరికి పెళ్ళిళ్ళు జరిగాయి. ఐతేనేం, కుటుంబంలో యింకా పెద్దమ్మ అధికారం లాంఛనప్రాయంగానైనా జరుగుతూనే వుంది. ఆమె ఆఖరుశ్వాస వదలిపెట్టేదాకా అదలా జరగనూ జరుగుతుంది.

పెద్దమ్మకు ఏక్షణాన ఎవరిపైన ఆగ్రహం కలుగుతుందో వూహించడం కష్టం. ఆమె యింట్లో కొందరిని చేరదీస్తుంది. మిగిలిన వాళ్ళను కాసుకు కొరగాకుండా మాటలనేస్తుంది. ఇంట్లో తన ప్రాధాన్యం గనుక తగ్గిపోతున్నట్టు తోస్తే చివరకు దగ్గుతూనైనా కూచుంటుంది. మొదట మొదట ఒకటి రెండు పూటలు తిండిమానేసి స్వప్రయత్నంతో తెచ్చుకున్న ఆదగ్గు కాలక్రమాన ఆధాక తీరని జబ్బైపోయింది. దానికి తోడు ఆమెలో మునపటి జవసత్వాలు గూడా తగ్గిపోయాయి. కొత్తగా ప్రాణభీతి ఒకటి ఆమెను ఆవహించింది.

"ఇదంతావట్టి కథాసంగ్రహం మాత్రమే. తీరిగ్గా ఎప్పుడైనా దీన్నిపెంచి పెద్ద కథగా వ్రాస్తే అప్పుడిది చిత్రాతి చిత్రమైన మానవ జీవిత గాథల్లో ఒకటౌతుంది''. అనుకుంటున్నాడు రామారావు.

"అబ్బబ్బ, ఏం చీకటీగలమ్మా పాడూ!'' అంటూ రామారావు తల్లి దుప్పటిని ముఖంపైకి తీసుకుంటోంది.

రామారావు తల్లివైపు చూచాడు. ఇంట్లో దీపమున్నట్టయితే ఆమెకు నిద్రపట్టదు. దీపం లేకపోతే రామారావు వ్రాసుకోవడం సాధ్యంకాదన్న స్పృహగాని, అలవాటు ప్రకారం రోజూ ఏదోకొంత వ్రాసుకోకపోతే అతనికి మతి పోయినంత పనవుతుందన్న పట్టింపుగాని ఆమెకులేవు. రామారావు ఏంచేసినా, ఏం చెయ్యకపోయినా తన సదుపాయాలు తనకు సమకూరితే ఆమెకదే చాలు! పెద్దమ్మకైతే ఎదుటివారి అదృష్ట, దురదృష్టాలను పట్టి ఒకరిపైన ద్వేషమూ ఒకరిపైన ప్రేమ కలుగుతాయి. ఈమె సంగతలాకాదు. మానవులపట్ల ఆమెకున్న అభిమానమే అంతంత మాత్రం! ఆ వున్న అభిమానం కాస్తా కూతుళ్ళ పైనే వుంది. రామారావు వల్ల వాళ్ళకేదో తీరనిఅన్యాయం జరిగిపోతోందన్నదే ఆమెలో ఆరనిచింత! సంపత్సరాని కొకటి రెండు సార్లు వాళ్ళను సుతీకొచ్చి, తీసుకొచ్చిన ప్రతిసారీ ఆరునెలలుంచుకుని పంపించడం లేదన్నదే ఆమె బెంగ! రామారావు తల్లికి మరొక తీరని కోరికగూడా వుంది. ఒకసారి కొడుకు





కోడల్ని చేయిజేసుకుంటే నేత్రానందకరంగా చూడవచ్చును గదా అన్నదే ఆ కోరిక! కలలైఐ అయిదేళ్ళ జీవితంలో ఏ మానవ ప్రాణిమీదా అధికారం చలాయించలేక పోయిన తపన,ఆమెకు కోడల్ని చూడగానే ఉద్రేకిస్తుంది. కాస్తా అతిశయోక్తిగా చెప్పాలంటే యిది పిల్లి ఎలుకమీదికి దూకే తంతు లాంటిది, కానీ యిందులో ఎలుక బొత్తిగా ఎలుకగాక పోవడమే వచ్చిన చిక్కు!

రామారావు అప్పుడప్పుడూ ఆలోచిస్తుంటాడు—తల్లి యింత విచిత్రంగా మారిపోవడానికి కారణమేమిటా అని! ఇందుకు సమాధానంగా అతడు పాతికేళ్ళ సాంసారిక జీవితంలో ఆమెకు కుటుంబంలో లభ్యమైన హీనస్థానాన్ని గురించి, సవతి మూలంగా ఆమె ఎదుర్కోవలసి వచ్చిన దుర్భర పరిస్థితుల్నిగూర్చి మననం చేసుకోవలసి వుంటుంది. ఐతే ఆదొకపనిగా ఆ దుఃఖ గాథను మననం చేసుకునేంతవరకూ అతడి మనసు యింకా మొద్దుబారలేదు. జీవితంలో మరిన్ని ఆటుపోట్లు చవిచూచి తల బట్టకట్టిన తర్వాత రామారావు ఆ పనికి పూనుకుంటాడు,

బిడ్డ కీచుకీచుమని ఏడవడంతో రామారావు తృళ్ళిపడ్డాడు. కానీ మరుక్షణాన్నే అతడి కర్థమైంది—చిరంజీవి నరేంద్రుడైతే అంతకంటే బిగ్గరగా ఏడవగలడనీ, యిప్పుడేడుస్తున్నది చెల్లెలి కూతురు చిరంజీవి శ్రీదేవనీ !

"అమ్మాయ్, బిడ్డ లేచింది. ప్రక్కకు తీసుకో'' అంటోంది తల్లి, కానీ హెచ్చరికకు ఏమాత్రం ఫలితం కనబడక పోవడం చేతఆమె తనే దుప్పటిపైకి తీసి బిడ్డను తల్లి ప్రక్కలో చేరగిల వేసింది !

చెల్లెలు యింత నిశ్చింతగా ఎలా నిద్రపోగలుగుతోందా అన్నది రామారావు జిజ్ఞాసల్లో ఒకటి. ఒకవేళ నిరాశా, నిద్రా అక్కచెల్లెళ్ళేమో ! జీవితంలో నిరాశ, నిస్పృహ మోతాదు మీరిన కొద్దీ, నిద్రకూడా మరీ యింత ముమ్మరంగా మనిషిని ముంచుకొచ్చేస్తుందేమో !

రామారావు బావమరదికి పట్టణంలో లోయర్ డివిజన్ గుమాస్తా వుద్యోగం - అరువుగా దొరికిన అర్థరూపాయ డిటెక్టివ్ నవలలు చదవడం అతడి హాబీ. అన్నిపనుల నుంచీ రిటయిరైన తల్లిదండ్రులు, పెళ్ళికావలసిన చెల్లెలు, హైస్కూల్లో ప్రతి తరగతిలోనూ ఫెయిల్ కావడమే పనిగా పెట్టుకున్న తమ్ముడు, యిందరికిపైన, పట్టణంలో పనులు చేసుకోడానికి వెళ్ళి, వెళ్ళినప్పుడల్లా యింటిని ముట్టడించే బంధువర్గం - యింత మందితో నిండి నిబిడీకృతమైన సంసారం తన స్వల్ప సంపాదనతో స్తిమితంగా సాగదని అత దేనాడో నిర్ధరించుకున్నాడు. ఆ మాట కాస్తా భార్యతోనూ చెప్పేశాడు. ఇద్దరూ కలసి మాట్లాడుకున్నారు. మౌనమే భూషణమను కున్నారు. దూషణ భూషణలు శరీరానికేగానీ ఆత్మకు కాదను కున్నారు. సంయోగవియోగాలు దైవాధీనాలనుకున్నారు. ఇంక వాళ్ళను ఈ లోకానికి సంబంధించిన ఏవిషయం మాత్రం బాధించ గలుగుతుంది ?

రామారావు ఆలోచన లీసారి గోడకు బల్లిలా కరచుకుని పడుకున్న శకుంతలపైకి ప్రవహించాయి.

నాలు గంకణాల పూరింట్లో మొదటి అంకణంలో పొయ్యి, పాత్రలు, నీళ్ళబానలు వీటి మధ్య తావుచేసుకుని రామారావు తల్లీ,



చెల్లెలు పడుకున్నారు. రెండో అంకణంలో ద్వారం వుంది. మూడో అంకణంలో సగం మేరకు బెంచీలు ఆక్రమిస్తాయి. నాలుగో అంకణంలో ఒక గాది, నాలుగు దొంతులూ ఉన్నాయి. దురదృష్టవశాత్తు రామారావు ఇంటికి యిరవై గజాల దూరంలో ఓ కొండ వాగు పరుగెడుతోంది. అందులోనుంచీ చెమ్మ నేలమట్టానికన్నా తగ్గులో వున్న రామారావు యింట్లో మూడు,నాలుగు అంకణాల్లోకి వ్యాపిస్తుంది. ఆ చెమ్మనుంచీ పై దొలగుతూ గోడను ఆశ్రయిస్తోంది శకుంతల!

అవనిలో నా వంటి ఆడు జన్మముకన్న రాయిగా రప్పగా పడివుండటంగూడా మేలే నన్నది ఓ రచయిత్రి. కాకపోతే, మరి మానవ జన్మమెత్తి శకుంతల ఏం సుఖపడింది? ఎనిమిదో యేడు జరుగుతుండగా తల్లి పోయింది. మారుతల్లి కాపురానికి వచ్చింది. అప్పటినుంచీ బ్రతుకంటే ఓ సంఘర్షణ అనే ఆమెకు అర్థమయింది. తండ్రి ఆమెకో మేలు చేయగలిగాడు - శకుంతల చదువుకుంది. ఆ చదువుతో ఓ చిన్న వుద్యోగం చేయగల విశ్వాసం ఆమెకు కద్దు. కానీ ఆమె తీరా పబ్లిక్ పరీక్షలో ఫెయిలయింది. కాగా ఆ చదువువల్ల-పాసై వుండి, ఉద్యోగం చేసి వుంటే ఈ బండెడి చాకిరీ తప్పివుండేదిగదా అన్న ఆవేదన మాత్రం మిగిలింది!



"ఏమండీ! మీ రింకా పడుకోలేదా?" తల పైకెత్తి ప్రశ్నించింది శకుంతల.

"పడుకుంటాను" అన్నాడు రామారావు.

"కథ యింకా పూర్తి కాలేదేమిటి?"

"ప్రారంభించకనేపోతే పూర్తవే దెక్కడ? ఓ మనిషిని గురించి కథ వ్రాయా లనుకున్నాను. కానీ ఆలోచించగా వాడికి కథంటూ ఒకటి లేదని తేలింది. పోగా వాడి పుణ్యమా అని నాలుగైదు కథలకు ప్లాట్లు స్ఫురించాయి. ఇప్పుడు కాదు. మరెప్పుడో వ్రాస్తాను. కాస్త వేడినీళ్ళుంటే యివ్వు" ఆవలిస్తూ అడిగాడు రామారావు.

"వేడినీళ్ళెక్కడున్నాయి? అత్తయ్య కుండను పైకితీసి పొయ్యిలో నుగ్గులువేసి పడుకున్నారు."

రామారావు తల్లికి చీకటీగలు అగర్భ శత్రువులు. ఈ నుగ్గుల ప్రక్రియద్వారా ఆమె ప్రతిరాత్రీ వాటికి మారణహోమం జరుపుతుంది.

రామారావు చల్లగా ఓ టంబ్లరునీళ్ళు త్రాగి తలుపు తెరచుకుని బయటికి వెళ్ళాడు.

కొట్టంలో కట్టుగూటం దగ్గరనిల్చున్న కపిలగోవు రామారావు కనిపించగానే పగ్గం లాక్కుంటూ గింజుకుంది.

ఆవుకు గడ్డి వేస్తుండగా రామారావుకు ఓ విషయం జ్ఞప్తికి వచ్చింది.

మూడు నెల లప్పుడు, ఓ నెలవురోజున రామారావు కున్న మూడు గొడ్లను మేతకు తోలు కెళ్ళాడు.

అప్పటికి వానల్లేవు. నిదాఘం. ఆఖరు గరిక పోచగూడా ఎండి మాడి మట్టిదిని పోయింది. ఆవులు కాసేపు కలబండుపట్టలు కొరికాయి. మరి కొంతసేపు గానుగాకు తిన్నాయి. ఆ తరువాత తలలు పైకెత్తుకుని దిక్కులకు బిక్కరించి చూచాయి.

అప్పట్లో నెల్లూరు ప్రాంతం నుంచి కొండల్లా వచ్చేవి కసువు లారీలు. కసువు వెల పాతిక రూపాయలైతే లారీ బాడుగ వంద రూపాయలు!

బక్కచిక్కిన పేదరైతు కడుపు నిండడానికీ ఒక్కరూపాయి చాలదు. డొక్కలెండిన గోవు తాలూకు "ఒళ్ళంతా కడుపు" నిండడానికీ ఒక్కరూపాయి చాలదు.

చేను దున్నిస్తూవుండి ఓ రోజున రామారావు పొలానికి వెళ్ళాడు. పడుకోబోతున్న ఎద్దు కళ్ళల్లో రైతు ఏదోపొడి చల్లుతున్నాడు.

"ఏమిటది?" అన్నాడు రామారావు.

"మిరప్పొడి" అన్నాడు నెమ్మదిగా రైతు.

"మిరప్పొడే! ఎద్దు కళ్ళల్లో మిరప్పొడే! ఎందుకూ?" ఆక్రోశించాడు రామారావు.

"కళ్ళు మండినంతసేపూ ఎద్దు పడుకోదు బాబూ! నీ దగ్గర ఎప్పుడో తీసుకున్నాను కూలి డబ్బులు. మొదట నీ బాకీ తీర్చాలి. ఆ పైన నేను దున్నుకోవాలి, ఎద్దు పడుకుంటే కాపురా లేంకావాలి?" అన్నాడు రైతు.

—ఇందాకా ఆలోచిస్తూవచ్చి తననుతానే మందలించుకున్నాడు రామారావు. ఇవన్నీ ఈ పురిటిగడ్డపైన మంటిలో పుట్టి మంటితో పోరాడి, కడకు మంటిలో కలసిపోనున్న దీన మానవుల జీవిత బృహత్కథలోని చిన్న చిన్న ఉపాఖ్యానాలు. ప్రస్తుతానికి

వీటిని స్మృతుల కోషాణంలో పదిల పరచు కుంటేచాలు !

రామారావు ఆదరాబాదరా తొట్టిలోని నీళ్ళతో ముఖమూ, కాళ్ళూ, చేతులూ కడు క్కున్నాడు. పైగుడ్డతో ముఖం తుడుచు కున్నాడు. నాలుగోలోకం తనకోసం ఎదురు చూస్తోందన్న ఊహతో గబగబా యింట్లో ప్రవేశించాడు.

అన్నట్టు రామారావుకు నాలుగు లోకా లున్నాయి—


ఒకటి ఉద్యోగం, అక్కడ రామారావు అటెండన్సు వేస్తాడు. పాఠాలు చెబుతాడు. పిల్లలను బాదుతాడు. ఇన్‌స్పెక్టరులకు సెల్యూట్లుచేసి వాళ్ళ చీదరింపులకు వినయ పూర్వకంగా సంజాయిషీలు చెప్పుకుంటాడు.

రెండు గృహలోకం, ముఖ్యంగా రామారావు అసమర్థత బయటపడేది యిక్కడే! వైరి వర్గాలమధ్య యుద్ధం చెలరేగితే శాంతిదూతగా వ్యవహరించి పంచశీలను నూరిపోసి విఫలుడై వెల్లకిలపడతాడు. పెద్దవారికి నచ్చచెబుతాడు, పెళ్ళాన్ని ఓదార్చుతాడు. అప్పులవాళ్ళను ఎక్కడివాళ్ళనక్కడే సర్ది పంపుతాడు. "ఋణానుబంధరూపేణా పశుపత్నీసుతాలయా" అని అప్పుడప్పుడూ వైరాగ్యంకూడా అవలంబిస్తాడు.

మూడోది సాహిత్యలోకం. అడిగేనాధుడు లేడుగనుక యిచ్ఛా విహారం. ఇక్కడ స్వేచ్ఛా విహంగం రామారావు.

నాలుగోది నిద్రాలోకం. రామారావిప్పుడు ప్రవేశించబోతున్నలోకం.

రామారావు బెంచీపైన పడుకున్నాడు. దుప్పటి కప్పుకున్నాడు. రామారావు జీవితాదర్శాలకూ జీవితావసరాలకూ ఎలాంటి నిష్పత్తివుందో, అతడి భౌతిక శరీరానికీ ఆ దుప్పటికీ అదే నిష్పత్తి అమల్లోవుంది. రామారావుకు యిరవై యెనిమిదేళ్ళు. ఆ దుప్పటికి పన్నెండేళ్ళు. క్రిందా పైనా నూలు పోగులుజారిపోతున్నాయి. దాన్ని ముఖంపైకి లాక్కుంటే కాళ్ళ వెలుపల యుండిపోతాయి. కాదని పాదాలకు కూడా కప్పుకుంటే ముఖం బయటుండిపోతుంది. అందుచేత కాళ్ళను కడుపులో దాచుకుని గట్టిగా దుప్పటి కప్పుకున్నాడు రామారావు !



# సర్దుకుపోండి

రత్నామహేంధర్

ఏమిటి సర్దుకోడం? పెట్టె బేడా? అవేవీ కాదమ్మా. మరి? వెనకటికి నే నోసారి అదేదో పల్లెటూరు వెళ్ళాల్సి వచ్చి ఒక రెండెద్దుల బండిలాంటి బస్సెక్కాను. ఎక్కిన దగ్గరనుంచీ. "అ. సర్దుకోండమ్మా. సర్దుకోండీ ... ఏయ్ అమ్మీ సర్దుకో. ఏటలా కూకున్నావ్ ... ఆ యమ్మాయిగారికి చోటియ్యి." అంటూ ఆ బస్సు కండక్టరు + క్లీనరు + డ్రైవరు అయిన ఒక నల్లటి ఆసామీ అరుస్తున్నాడు—అలాటి సర్దుకు పోవడమా? అబ్బబ్బ! అలాటి వేవీ కాదమ్మాయిలూ!



"ఓహో, తెలిసింది. మేము ఎక్కడికైనా పేరంటానికెడితే చీర నలక్కుండా ఉండాలని. చీరను దూరంగా పరిచి కూర్చునే మా బామ్మగారో (క్షమించాలి! బామ్మలు పేరంటానికి రారు కానీ, అక్కడ ఉంటారు). అమ్మమ్మగారో. లేక పక్కయింటి (లావు పాటి లెంకి) పిన్నిగారో "అదేమిటే పిల్లా! కాస్త సర్దుక్కూచో. అలా పరిచేశా వేమిటా చీర?" అంటారు. అదే అయి ఉంటుంది...పోయింది. పూర్తిగా తప్పిపోయింది మీ వూహ. మీ రనుకున్నవేవీ కావు ఇప్పుడు చెబుతా వినండి.

మొట్టమొదట మన మనస్సుతో మనం సర్దుకుపోవాలి. లేకపోతే అది ఊరుకోక "అది కావాలి యిది కావాలి" అంటుంది. అప్పుడేమో మనం మన నాన్నలనీ, పెళ్ళయితే భర్తలనీ వేధిస్తాము. అది మనకీ మంచిది కాదు వారికీ మంచిది కాదు

అలాగే-లీలకి నలుగురు పిల్లలు అయినా ఆమె యిల్లంతా శుభ్రంగా సర్ది భర్త ఆఫీసునుంచి వచ్చేసరికి "నీట్"గా అమర్చి వంటింట్లోకి వెడుతుంది. ఇంతలో ఆ నలుగురు పిల్లలు రైలాట ఆడటానికి కుర్చీ ... "క్యూ" లో పేరుస్తారు ... తాలు విరజిమ్ముతాడు ఇంతలో ఆఫీసునుంచి ఆయన వచ్చి యిల్లంతా దర

